ప్రతి రోజూ చెత్తను సేకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ నాగమణి

కీసర: నాగారం మున్సిపాలిటీ ఎప్పుడు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతోందని మున్సిపల్ ఇంచార్జి కమిషనర్ నాగమణి అన్నారు. మంగళవారం ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది, చెత్త సేకరించే సిబ్బంది, మున్సిపల్ జవాన్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో చెత్త సేకరించే సిబ్బంది ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా ప్రతి రోజూ చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. అదేవిధంగా జవాన్లు వార్డుల్లో ఎక్కడ కూడా చెత్త లేకుండా శుభ్రంగా ఉండేవిధంగా విధులు నిర్వహించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచితనీటి, వైద్య సదుపాయాలను కల్పించాలంటూ వినతి


మంత్రి దామోదర రాజనర్సింహకు వినతి పత్రం అందజేస్తున్న జేఏసీ కన్వీనర్ శంకర్‌నారాయణ తదితరులు

కీసర: జవహర్‌నగర్ చెత్త డంపింగ్ యార్డు బాధిత ప్రజలకు ఎన్‌జిటి ఆర్డర్ ద్వారా రామ్‌కి మరియు జీహెచ్‌ఎంసీ ఒప్పందం ప్రకారం ఉచిత వైద్యం, మంచినీటి సదుపాయాలు, కల్పించాలని కోరుతూ మంగళవారం దమ్మాయిగూడ జేఏసీ ఆధ్వర్యంలో సచివాలయంలో హెల్త్‌మినిస్టర్ దామోదర రాజనర్సింహను కలిసి డంపింగ్ యార్డు నిర్వహణ లోపాలను, ప్రజలకు ఎన్‌జిటి ఆర్డర్ ద్వారా రామ్‌కి సంస్థ, మరియు జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య సదుపాయాలతోపాటు, మంచినీటి సరఫరా, తదితర సౌకార్యాలు కల్పించాలని వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు జేఏసీ సభ్యులు తెలిపారు. అనంతరం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిను కూడా కలిసిన జేఏసీ సభ్యులు ఉచితనీటి సదుపాయం, ఉచిత వైద్య సదుపాయాలను కల్పించాలని కోరారు. త్వరలో డంపింగ్‌యార్డు పరిశీలనకు వస్తానని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి జేఏసీ సభ్యులకు తెలిపినట్లు జేఏసీ కన్వీనర్ డాక్టర్ శంకర్‌నారాయణ తెలిపారు. జేఏసీ కో–కన్వీనర్లు ఏనుగు సంజీవరెడ్డి, మారం సమ్మిరెడ్డి, గవిని స్వర్ణశ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ సభ్యులు

ఆటోస్టాండ్ ఏర్పాటు చేయాలి


ఎంపీ ఈటలకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ సభ్యులు

కుషాయిగూడ: చర్లపల్లి రైల్వే టర్మినల్‌లో ఆటోస్టాండ్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ.. మంగళవారం కాప్రా సర్కిల్ ఆటో యూనియన్ నాయకులు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఉచిత బస్సులతో ఇప్పటికే ఉపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ చాలీచాలని జీవితాలు గడుపుతున్నామని ఎంపీకి తెలిపారు. సర్కిల్ పరిధిలోని ఆటోలు నిలిపేందుకు అనువుగా ఆటోస్టాండ్ ఏర్పాటు చేయించి చతికిలపడ్డ ఆటో డ్రైవర్లకు చేయూతనివ్వాలని కోరారు. ఈ విషయాన్ని రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లి తోడ్పాటును అందించాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్‌టీయూ ఆటో యూనియన్ నాయకులతో పాటు కాప్రా సర్కిల్ ఆటో యూనియన్ అధ్యక్షుడు రామాంజనేయులు, గోపాల్‌నాయక్, రమేష్, నరేష్, జయరాజ్, శ్రీనివాస్, నర్సింగ్ నాయక్, లక్ష్మీనారాయణ, శ్రీను, అనీల్, బాలకృష్ణ, సుమన్, సాయికిరణ్, రవి, స్వామి, దాసు, వెంకటేష్, ప్రభాకర్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు


రాంపల్లిలో అమ్మవారిని దర్శించుకుంటున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్


మహాలక్ష్మిదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన కీసరగుట్ట అమ్మవారు


గోపిక్రిష్ణకాలనీలో అమ్మవారి మండపం వద్ద చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు

కీసర: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం నాగారం మున్సిపల్ రాంపల్లిలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం వద్ద నిర్వహించిన చండీహోమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇంఛార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇదిలా వుండగా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కీసరగుట్ట శ్రీ భవానీశివదుర్గా అమ్మవారు మంగళవారం మహాలక్ష్మదేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్ నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి, పండితులు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. నాగారం గోపిక్రిష్ణ, కాలనీలో జై భవానీ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం వద్ద చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

రాజరాజేశ్వరిదేవిగా గడి మైసమ్మ

మేడ్చల్: దేవీనవరాత్రి ఉత్సవాలలో 6వ రోజైన మంగళవారం అమ్మవారిని రాజరాజేశ్వరి రూపంలో అలంకరించారు. వివిధ మండలపాలలో, కాలనీలలో, ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గడి మైసమ్మ ఆలయంలో అమ్మవారిని రాజరాజేశ్వరిదేవిగా అలంకరించి దర్శనం చేసుకున్నారు. రాఘవేంద్రనగర్ కాలనీ, ఆర్టీసీ కాలనీ కట్టమైసమ్మ ఆలయంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. చండీ హోమాలు, అన్నదాన కార్యక్రమాలు, లక్ష పూల అర్చన, కుంకుమార్చన వంటి కార్యక్రమాలు జోరుగా నిర్వహిస్తున్నారు.



లక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీతో పాటు మండలంలోని గ్రామాల్లో దేవీశరన్నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. భక్తులు పెద్ద ఎత్తున వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. నవరాత్రుల్లో భాగంగా 6వ రోజు అమ్మవారు మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. మేడ్చల్ మున్సిపల్ పరిధి పూడూర్ గ్రామంలోని దుర్గమ్మ ఆలయం వద్ద అర్చకులు వెంకటేష్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, గణపతి హోమం, మూలమంత్ర హోమం, పూజలు, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.


పూడూర్‌లో సామూహిక కుంకుమార్చనలో భక్తులు


ఘట్‌కేసర్‌లో ప్రత్యేక పూజలు చేస్తున్న పావనీ జంగయ్య, మహేశ్‌గౌడ్ తదితరులు


ప్రత్యేక పూజలుల్లో కట్ట ఆంజనేయులు గౌడ్

మక్తలో ఘనంగా శరన్నవరాత్రి వేడుకలు

పోచారం: చౌదరిగూడలోని మక్తలో దుర్గాదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా అమ్మవారిని మంగళవారం సరస్వతీ దేవీగా అలంకరించారు. కాంగ్రెస్ పార్టీ చౌదరిగూడ అధ్యక్షుడు కట్ట ఆంజనేయులు గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఈజీఎస్‌లో అభివృద్ధి పనులకు కార్యాచరణ ప్రణాళిక



సాక్షి,సిటీబ్యూరో: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఈజీఎస్) అమలులో భాగంగా రానున్న ఏడాదిలో వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టటానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించటానికి అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) రాధికా గుప్తా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఈజీఎస్‌లో భాగంగా రానున్న ఏడాదిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉపాధి హామీ పనుల్లో గుర్తించిన వివిధ రకాల పనులను పూర్తి చేయాలన్న లక్ష్యంపై మండల పరిషత్ అభివృద్ధి, పంచాయతీశాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బంది అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. లేబర్ మొబలైజేషన్, హార్టికల్చర్‌లో రైతులను గుర్తించటం, నర్సరీలలో మొక్కల పెంపుదలపై తగిన జాగ్రతలు తీసుకోవాలన్నారు. నీటి నిలువల సౌకర్యాలు పెంచడం, ఉపాధి హామీ పథకంలో గుర్తించిన 266 పనులతో సహా వ్యక్తి గత పనులు గుర్తించాలన్నారు. గ్రామ సభ ప్రణాళికను నవంబర్ 30 నాటికి, మండల స్థాయిలో డిసెంబర్ 25 నాటికి, జిల్లా స్థాయిలో జనవరి 21 నాటికి పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ రాధికా గుప్తా సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివరావు, డీపీఓ వెంకటయ్య, డిప్యూటీ సీఈఓ నీరజా పాల్గొన్నారు.

నియామకం

రామంతాపూర్ : ప్రధాన రహదారిలో దసరా పర్వదినం సందర్భంగా శనివారం సాయంత్రం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, బీజేపీ విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించే రావణ సంహార దహన మేళా చైర్మన్‌గా బుర్ర రాజేశ్వర్, అధ్యక్షుడిగా వల్లపు జగన్‌యాదవ్ నియమితులయ్యారు.

పండగలకు వసతులు కల్పించాలని వినతి


కమిషనర్ నాగిరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న పూడూర్ నాయకులు

మేడ్చల్: మున్సిపాలిటీలో విలీనమైన పూడూర్ గ్రామ పరిధిలో బతుకమ్మ పండగ, దసరా పండగలను ఘనంగా నిర్వహించుకునేందుకు మున్సిపాలిటీ తరుపున అన్ని వసతులు కలిపించాలని గ్రామస్థులు మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డిని కోరారు. ఈమేరకు గ్రామస్థుల్లో కొందరూ కమిషనర్ నాగిరెడ్డిని మున్సిపల్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. బతుకమ్మ, దసరా పండగల కోసం లైటింగ్‌సిస్టంతో పాటు సౌండ్ సిస్టం ఏర్పాటు చేయాలని, దసరా కోసం జాతీయ జెండా ఆవిష్కరణకు ఏర్పాట్లు, రావణ దహనం వంటి సౌకర్యాలు కలిపించాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

దుకాణ సముదాయానికి వేలం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీనగర్ చౌరస్తా వద్ద గల దుకాణ సముదాయాలలోని ఓ షాపుకు మంగళవారం వేలం పాట నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మి శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ స్వామి ఆధ్వర్యంలో 3వ నెంబర్ షాపుకు బహిరంగ వేలం నిర్వహించగా బుచ్చయ్యచారి రూ.14500 నెలసరి అద్దె చెల్లింపుతో మూడేళ్ల పాటు షాపును అద్దె కొరకు దక్కించుకున్నారు. వేలంలో మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ ఓల్డ్ మిర్జాలగూడలో శ్రీఆంజనేయ సేవా భక్త బృందం ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం నుంచి ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ట, ఉత్సవస్వామి అభిషేకం, హోమం, డోలోత్సవం, పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, ఆంజనేయ సేవా భక్త బృందం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్సీ సంఘం వార్షికోత్సవం


యునైటెడ్ ఎస్సీ సంఘ వార్షికోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న సభ్యులు

పోచారం: యునైటెడ్ ఎస్సీ సంఘం పోచారం శాఖ ప్రథమ వార్షికోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని సంఘ సభ్యులు ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడుగా సంజీవను రెండోసారి ఎన్నుకోవడం జరిగింది. కాగా, అధ్యక్షుడుగా నరేష్, ఉపాధ్యక్షుడుగా రామచందర్, ప్రధాన కార్యదర్శిగా హరిబాబు, సంయుక్త కార్యదర్శిగా బాలు, కోశాధికారిగా జోగు శామ్యూల్, కార్యనిర్వహణ సభ్యులుగా ములుగు నర్సింగరావు తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం కేక్ కట్ చేశారు.

పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి


ఘట్‌కేసర్‌లో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న రవీందర్

ఘట్‌కేసర్: పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, నూతన పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సౌత్ సెంట్రల్ రైల్వే డివిజనల్ ప్రధాన కార్యదర్శి రవీందర్ అన్నారు. మంగళవారం ఘట్‌కేసర్ పట్టణంలో చేపట్టిన సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఎన్నికల ప్రచారానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ కార్మికులకు నైట్ పెట్రోల్ మెన్‌లను ఇద్దరిని ఇవ్వాలని, రైల్వే శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు అండగా ఉండి నిత్యం వారి సమస్యలపై పోరాడే ఎర్ర జెండా గుర్తుకు ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఎస్, సీఈఎస్ ప్రెసిడెంట్ స్వామి, కోశాధికారి నర్సింహ్మారెడ్డి, అధ్యక్షుడు విజయ్‌కుమార్, బ్రాంచ్ సెక్రటరీ, వెంకటేశ్వర్లు, కిరణ్, అశోక్, వెంకటస్వామి, భాస్కర్ పాల్గొన్నారు.




పట్టణంలో బతుకమ్మ పండగ సంబరాలలో మహిళలు

సందడిగా సద్దుల బతుకమ్మ

మేడ్చల్: మేడ్చల్ పట్టణంలో 6 రోజుల పాటు బతుకమ్మ సంబరాలు జరుపుకుని 7వ రోజైన మంగళవారం సద్దుల బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మేడ్చల్ పట్టణంలో 7 రోజులకె బతుకమ్మ పండుగను నిర్వహించడం తరాలుగా అనవాయితీగా వస్తుండటంతో బతుకమ్మ ఉత్సవాలను మహిళలు కాలనీలలో వైభవంగా జరుపుకున్నారు. ఆచార వ్యవహారాలు, సంస్కృతి సాంప్రదాయాలకు నిలయం అయిన సద్దుల బతుకమ్మ పండుగను ప్రజలు అత్యంత వైభవంగా భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు. మహిళలు గునుగు, తంగేడు, చామంతి, బంతి లాంటి వివిధ రకాల పూలతో బతుకమ్మను తయారుచేసి అందులో గౌరమ్మను పెట్టి పూజలు చేసి ఇంటిముందు వాకిట్లో ముగ్గులు పెట్టి బతుకమ్మ పాటలు పాడుతూ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ప్రధాన కూడలిలో బతుకమ్మ ఆటల అనంతరం గ్రామ చెరువులలో నిమజ్జనం చేశారు. పెద్ద చెరువులో, తుమ్మ చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. మరోవైపు అట్టహసంగా చైర్ పర్సన్ దీపిక నర్సింహ్మారెడ్డి ఇంటి సమీపంలో 8వ వార్డులో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సంగీత విభావరిలు నిర్వహించి గాయకులను రప్పించి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అన్ని పార్టీల నేతలు ఉత్సవాల్లో పాల్గొన్నారు.


ఘట్‌కేసర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

అంబరాన్నంటుతున్న బతుకమ్మ సంబరం

పోచారం: ప్రతాపసింగారంలో సద్దుల బతుకమ్మ సంబరాన్ని సందడిగా మంగళవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా మేడ్చల్ మాజీ శాసన సభ్యుడు మలిపెద్ది సుధీర్‌రెడ్డి దంపతులు ప్రతాపసింగారంలోని తన నివాసంలో తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చారు. సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతి ఆడబిడ్డ సంతోషంగా జరుపుకోవాలని సుధీర్‌రెడ్డి ఆకాంక్షించారు.


బతుకమ్మను పేర్చుతున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


బొక్కొనిగూడలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


ఘట్‌కేసర్‌లో బతుకమ్మతో యువతి

కలెక్టరేట్‌లో కన్నుల పండుగగా బతుకమ్మ

సాక్షి,సిటీ బ్యూరో: తెలంగాణ ఆడపడుచుల పండుగైన పూల బతుకమ్మ పండుగను మంగళవారం కలెక్టరేట్ ప్రాంగణంలో సాంప్రదాయ బద్ధంగా జరుపుకున్నారు. బతుకమ్మ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, డీఆర్‌డీఏ పీడీ సాంబశివరావు, డీపీఓ వెంకయ్యతో సహా వివిధ శాఖల అధికారులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. కన్నుల పండుగా సాగిన బతుకమ్మ పండుగ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టరు రాధికాగుప్తా మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగను అందరూ కలిసి జరుపుకోవటం సంతోషంగా ఉందన్నారు. బతుకమ్మలను అందంగా పూలతో పేర్చిన మహిళలకు పెద్ద బాలశిక్ష పుస్తకాలను జిల్లా అదనపు కలెక్టర్ బహుకరించారు. మహిళా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది బతుకమ్మ పాటలు పాడుతూ ఎంతో సంతోషంగా ఆడారు.

రావణ దహనంలోనూ రాజకీయాలా ?


గతేడాది మినీట్యాంక్ బండ్‌పై నిర్వహించిన రావణ దహనం (ఫైల్)

మేడ్చల్ రూరల్: ప్రజలంతా కలిసికట్టుగా జరుపుకోవాల్సిన పండగలను నాయకులు తమ రాజకీయాలకు వాడుకుంటున్నారు. మహనీయుల, పండగలను సైతం అడ్డుపెట్టుకుని గుండ్లపోచంపల్లి రాజకీయ నాయకులు వివాదాలకు తెరలేపుతున్నారు. గతేడాది అంబేడ్కర్, మహాత్మా గాంధీ విగ్రహాలను అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేసిన నాయకులు తాజాగా దసరా సందర్భంగా నిర్వహించే రావణ దహనాన్ని సైతం తమ రాజకీయాలకు వాడుకుంటున్నారు. గుండ్లపోచంపల్లి గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో నాటి సర్పంచ్ మద్దుల శ్రీనివాస్ రెడ్డి మినీ ట్యాంక్ బండ్ వద్ద దసరా రోజు రావణ దహనం కార్యక్రమాన్ని గత కొన్నేళ్లుగా చేపడుతున్నారు. ఈ ఏడాది కూడా వేడుకలు నిర్వహించేందుకు గత సోమవారం నుంచి పనులు ప్రారంభించగా అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు నాయకులు ఈ ఏడాది నుంచి అధికారంలో ఉన్న మనమే అక్కడ వేడుకలు నిర్వహించాలని భావించి ఎత్తులు వేసి ప్రత్యర్థి వర్గాన్ని అక్కడి నుంచి పంపే ప్లాన్ వేశారు.

పోలీస్‌స్టేషన్‌కు పంచాయితీ..

కాంగ్రెస్ నాయకులు తమ ప్లాన్ ప్రకారం మినీ ట్యాంక్ బండ్ సమీపంలో ఉన్న విల్లాలు, కాలనీ లవాసులతో మినీ ట్యాంక్‌బండ్‌పై రావణ దహనం కారణంగా తమకు ఇబ్బందులు కలుగుతున్నాయని, తమ ఇళ్లు అగ్ని ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందంటూ పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయించారు. పోలీసులు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతలను పిలిచి సర్ది చెప్పేందుకు యత్నించగా ప్రతీయేటలా అక్కడే రావణ దహన కార్యక్రమం చేపడతామని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అధికార పార్టీకి చెందిన నాయకులు తామే ఈసారి వేడుకలు నిర్వహిస్తామని తెలుపడంతో ఇరు వర్గాలను మినీ ట్యాంక్‌బండ్‌పై రావణ దహన వేడుకలు నిర్వహించొద్దని పోలీసులు హెచ్చరించారు. మాజీ సర్పంచ్ మరోచోట రావణ దహన వేడుకలు చేపడుతున్నారు.

నేటి నుంచి చెరువుల్లోకి చేపపిల్లలు

- 232 చెరువుల్లో.. 34 లక్షల చేప పిల్లలు వదిలేందుకు చర్యలు
- శామీర్‌పేట పెద్ద చెరువులో జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: ఆలస్యంగానైనా .. చెరువులు, కుంటల్లో చేప పిల్లలను వేసేందుకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా మత్స్యశాఖ ముహూర్తం ఖరారు చేసింది. సాధారణంగా వర్షాకాలం ఆరంభమై.. చెరువులు, కుంటలు నిండగానే ఆగస్టు లేదా సెప్టెంబర్ నాటికి చేప పిల్లలను పంపిణీ చేస్తారు. చేప పిల్లల టెండర్ల ప్రక్రియ జాప్యం కావటంతో ఆలస్యంగా పంపిణీ కార్యక్రమానికి మత్స్యశాఖ శ్రీకారం చుట్టింది. శామీర్‌పేట మండల కేంద్రంలోని పెద్ద చెరువులో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా బుధవారం చేప పిల్లలను వదలనున్నారు. ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్ రెడ్డి, శంభీపూర్ రాజు, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, కలెక్టర్ గౌతమ్, మత్స్యశాఖ అధికారి పూర్ణిమా, స్థానిక ప్రాజా ప్రతినిధులు పాల్గొననున్నారు. 2024–25 సంవత్సరంలో మత్స్యశాఖ కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 232 చెరువుల్లో 34 లక్షల చేప పిల్లల పంపిణీ లక్ష్యంగా నిర్ణయించింది.